

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో మీ భవిష్యత్తు, మీ బిడ్డల భవిష్యత్తుకు ఆలోచించి ఓటు వేయాలి. నా కష్టం, నా శ్రమ అంతా మీ, మీ బిడ్డల భవిష్యత్తు కోసమే.. మీ ఆశీస్సుల కోసం వచ్చా.. ఓటు వేసి ఆశీర్వదించండి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు మీ ఓటు కీలకం.

ఆలోచించి.. ఓటేయండి!



జన సంద్రం : రోడ్ షో, బహిరంగ సభకు వెల్లువలా తరలివచ్చిన జనం





నాకిది చాలన్నా : పవన్ వద్దకు రాగానే అంధురాలి ఆనందం



హత్తుకున్న పవన్ అభిమానం..

ఆంధ్రప్రదేశ్ దశ దిశ మార్చే ఎన్నికలివి..

- పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తా
- పురుషోత్తపట్నం వినియోగంలోకి తెస్తా
- సెజ్‌లో పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి
- ఉప్పాడ-కాకినాడ బీచ్‌ను అభివృద్ధి చేస్తా
- పిఠాపురం వారాహి సభలో పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 10: ఏపీ దశ దిశ మార్చే ఎన్నికలు ఇవి.. 25 ఏళ్ల ఏపీ భవిష్యత్తుకు మొదటి బీజం దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురాన్నే పడుతుంది..మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతా..అభివృద్ధి అంటే పిఠాపురంలా ఉండాలని, పార్లమెంట్ అంటే కాకినాడ లోక్‌సభ నియోజకవర్గంలా ఉండాలని దేశం మొత్తం ఇటు వైపు చూసేలా చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు.పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ బంగారమ్మ రావిచెట్టు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన వారాహి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన పిఠాపురంగా తయారు చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. పిఠాపురం పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని, ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. పిఠాపురంలో విద్యుత్ వైర్లు బయటకు వేలాడుతూ కనిపిస్తున్నాయని..అవి బయటకు కనబడకుండా చేసే ఆలోచన చేస్తానని చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారంతో ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణతో పాటు పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తెస్తామని తెలిపారు. నియోజకవర్గంలో సాగు,తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ బీచ్ అభివృద్ధి చేసి దేశంలోని ప్రజలంతా ఇక్కడకు వచ్చేలా చేస్తామని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాలు సేకరించి ఇంకా పలువురు రైతులకు పరిహారం ఇవ్వలేదని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని, ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చి పిఠాపురంతో పాటు కాకినాడ జిల్లా యువతకు ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. తనకు మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ప్రచారానికి వస్తే అతడిపై వైసీపీ గూండాలు డ్రింక్ బాటిల్‌తో దాడి చేశారని, అది తగిలి తెలుగుదేశం తమ్ముడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయని..అతడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. వైసీపీ గూండాలను తాను హెచ్చరిస్తున్నానని..రాబోయే కూటమి ప్రభుత్వంలో వారికి తగిన శాస్తి చేస్తామని చెప్పారు. కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసేవాడిని కానని స్పష్టం చేశారు. పిఠాపురంలో తాను ఎందుకు నిలబడ్డానో తెలుసుకునేందుకు మే 13న ఇక్కడకు రావాలని తన భార్యను కోరినట్టు తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనేది కనిపించకుండా చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విమర్శించారు. ఐదేళ్లపాటు ఏనాడూ ప్రజలకు కనిపించని వంగా గీత నేడు ఎన్నికల వేళ ప్రజల ముందుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. గీతకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్మ తనయుడు గిరీష్ వర్మ, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు పాల్గొన్నారు.

నెం 4పై నొక్కండి..

పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న తనకు చతుర్ముఖ బ్రహ్మలా బ్యాలెట్‌లో నాలుగో నెంబరులో ఉన్న గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేయాలని, కాకినాడ ఎంపీగా పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు తొమ్మిదో నెంబరులో ఉన్న గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉప్పొంగిన జనం..

పిఠాపురం/గొల్లప్రోలు/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మే 10 : జనకెరటం ఉప్పొంగింది. రహదారులన్నీ జాతరను తలపించాయి.ప్రజలు ఉప్పెనలా తరలివచ్చి పవన్‌కు నీరాజనాలు పలికారు. మహిళలు పూల వర్షం కురిపించి హారతులిచ్చారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. ఆర్వోబీ మీదుగా పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం పక్క రోడ్డు నుంచి జగ్గయ్యచెరువు కాలనీ, పశువుల ఆస్పత్రి, అపార్ట్‌మెంట్లు, సామర్లకోట రోడ్డు, పాదగయ జంక్షన్ వరకూ రోడ్ షో సాగింది. సమయాభావంతో బైపాస్ రోడ్ మీదుగా పవన్ గొల్లప్రోలు చేరుకోగా పట్టణ రహదారులన్నీ జన సంద్రమయ్యాయి. పుర కార్యాలయం సెంటర్‌లో మహిళలు బెలూన్లతో స్వాగతం పలికారు. పలుచోట్ల చిన్నారులను ఎత్తుకున్నారు. చేబ్రోలు శివాలయం, మల్లవరం సెంటర్ మీదుగా ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో రోడ్‌షో కొనసాగించారు. కొత్తపల్లి మండలంలో రోడ్‌షో కొనసాగింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన కొమ్మూరి గంగాధర్ తాను ల్యాండ్ టైటిలింగ్ చట్టానికి బాధితుడనని తెలుపుతూ చిత్రాడలో ప్లకార్డు ప్రదర్శించగా పవన్‌కల్యాణ్ స్పందించి ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని తెలిపారు.



ఇదే టీమ్ : పవన్, శ్రీనివాస్, వర్మ అభివాదం

6 గంటలు ఆలస్యంగా..

ఉదయం 9 గంటలకు రోడ్‌షో ప్రారంభమవుతుందని ముందుగా చెప్పినప్పటికీ ఆరు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది.ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురవడంతో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతులు రావడంలో జాప్యం జరిగింది. దీంతో ఉదయం 10 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్‌కు రావాల్సిన పవన్ మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలులోని నివాసానికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఆయన నివాసం నుంచి బయలుదేరి పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి 3.20 గంటలకు చేరుకున్నారు. మహాలక్ష్మి ఆలయం నుంచి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, జానీ మాస్టర్‌లతో కలిసి రోడ్‌షో చేశారు.



పవన్‌కు జేజేలు : పిఠాపురంలో పవన్‌కు జై కొడుతున్న జనం



మేమూ మీ వెంటే : పిఠాపురంలో పవన్‌కు మహిళల స్వాగతం



నీ చేయి తగిలినా చాలన్నా : పిఠాపురంలో యువత క్యూ

పవన్ సభపై ఇంకా.. నిరీక్షణే

- కాకినాడ సిటీలో పవన్ పర్యటనకు అధికారుల చిక్కులు
- వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఒత్తిళ్లతో అనుమతి నిరాకరణ
- ముందే దరఖాస్తు చేసిన టీడీపీ, జనసేన
- కాకినాడ ఆర్వో కార్యాలయం వద్ద 48 గంటలుగా ఇరుపార్టీల నేతలు పడిగాపులు
- అయినా అనుమతులు ఇవ్వని అధికారులు

కాకినాడ, మే 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారం ముగించే సమయం ఆసన్నమైంది. ఇంకో రోజు మాత్రమే ఉంది. చివరిరోజు కాకినాడ నగరంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. రోడ్‌షో, బహిరంగ సభకుగాను అనుమతుల కోసం టీడీపీ, జనసేన నేతలు దరఖాస్తు చేశారు. కానీ, అధికారులు ఇంకా అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. 48గంటలనుంచి కూటమి నేతలు అనుమతుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజుల్లో భాగంగా శనివారం కాకినాడ సిటీలో పర్యటించాలని పవన్‌కళ్యాణ్ మూడు వారాల కిందట నిర్ణయించారు. కిలోమీటరు రోడ్డుషో, తర్వాత సభ ఏర్పాటుకు నిర్ణయించారు. దీనికి సంబంధించి మూడురోజుల కిందట కాకినాడ సిటీ టీడీపీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండబాబు, మరికొందరు జనసేన నేతలు అనుమతుల కోసం డీఎస్పీ, నియోజకవర్గ ఆర్వోకు దరఖాస్తు చేశారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు కాకినాడసిటీలో పవన్ పర్యటిస్తే ఆ ప్రభంజనంతో తన ఓటమి ఖాయమనే ఆందోళన ద్వారంపూడిని కొన్నిరోజులుగా వెన్నాడుతోంది. దీంతో అధికారులు, పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం 48గంటలుగా పడిగాపులు కాస్తున్నా అనుమతులు ఇవ్వకపోవడంపై టీడీపీ, జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 12గంటల ఆర్వో కార్యాలయం వద్ద అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనుమతులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. అయినా అధికారుల్లో చలనం లేదు. ఓ వైపు చివరిరోజు కాకినాడ జిల్లా పిఠాపురంలో సీఎం జగన్ సభ ఉండడంతో.. ఇదే రోజున పవన్‌కల్యాణ్‌కు కాకినాడలో సభకు అనుమతులు ఇస్తే ఎలా ఉంటుదోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

'బంధం' బలమెంత?

- గోదావరి తీరంలో ఐక్యతా రాగం
- వైసీపీకి వణుకుపుట్టిస్తున్న 'కూటమి'
- ఓట్ల బదిలీకి పట్టుబిగించిన నేతలు
- సామాజిక సమీకరణాల్లోనూ మార్పులు
- 'కీలక' ఓటింగ్ వర్గాలపై ప్రభావితం
- ఒకే మాట.. ఒకే లక్ష్యంతో ముందుకు సాగిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

- 5లో

నేడు పిఠాపురానికి సీఎం జగన్


- ప్రజలకు కష్టాలు ప్రారంభం
- జగన్ వచ్చే మార్గంలో షాపులు మూయాలని హుకుం
- ఇప్పటికే చెట్ల నరికివేత
- జనసమీకరణకు నేతల పాట్లు
- వైసీపీ నాయకుల మధ్య సమన్వయ లోపం

- 4లో

నేడు మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ పిఠాపురం రాక

- 4లో

అభ్యర్థితో.. ఒకరోజు



టీడీపీలో చేరిన వారితో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

ఉదయం ఆంధ్రజ్యోతి దినపత్రిక చదువుతూ..

రసవత్తరంగా ప్రచారం.. వ్యూహాత్మకంగా పయనం

సంయమనంతో నిర్ణయాలు

మరో 48గంటల్లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో బిజీగా ఉన్న జ్యోతుల నెహ్రూతో శుక్రవారం ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒకరోజు' కార్యక్రమం నిర్వహించింది. ఆయన జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని స్వగృహంలో ఉదయం 5.30 గంటలకే నిద్రలేచి పత్రికలు చదివారు. స్నానాధికాలు ముగించుకుని అల్పాహారం స్వీకరించి పూజ చేసుకున్నారు. ఉదయం 9.30గంటలకు బయలుదేరి ఇర్రిపాక శివాలయానికి వెళ్లి దర్శనం చేసుకుని జగ్గంపేట పార్టీ కార్యాలయానికి బయలుదేరివెళ్లారు. 11గంటలకు గండేపల్లి మండలం సుబ్బయ్యమ్మపేట ప్రచారానికి వెళ్లారు. చైతన్యరథంపై జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు తిరిగి జగ్గంపేట పార్టీ కార్యాలయానికి చేరుకుని భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నారు. 3.30గంటలకు ఇర్రిపాకలోని స్వగృహానికి వెళ్లారు. సాయంత్రం 4గంటలకు గోకవరం మండలం కృష్ణునిపాలెంశివారు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రచారంలో పాల్గొన్నారు. రాత్రి 10గంటలకు జగ్గంపేట పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడ ఉన్న నాయకులతో మంతనాలు జరిపి 11గంటలకు ఇర్రిపాకలోని స్వగృహానికి వెళ్లిపోయారు. -వివరాలు 5వపేజీలో..



ఏవీనగరం ప్రచారంలో ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న దివ్య

ఉదయం ఆంధ్రజ్యోతి దినపత్రిక చదువుతూ..

తునిలో పట్టు కోసం..

వడివడిగా అడుగులు

పోలింగ్ సమయం దగ్గర పడడంతో తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య కూటమి పార్టీల నాయకులతో వివిధ ప్రజా, కార్మికసంఘాలను, కార్మిక సంఘాలను కలుస్తూ ప్రచారం స్పీడ్ పెంచారు. ఆమెతో శుక్రవారం ఆంధ్రజ్యోతి 'అభ్యర్థి ఒక్కరోజు' కార్యక్రమం నిర్వహించింది. యనమల దివ్య ఉదయం 5గంటలకే నిద్రలేచి పూజలు చేసి 6.30గంటలకు దినపత్రికలు చదివారు. ఉదయం 7గంటలకు నియోజకవర్గంలోని కీలక నాయకులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తుని నియోజకవర్గ మహిళా నాయకులతో ఉదయం 8గంటలకు సమావేశమయ్యారు. 8.30గంటలకు అల్పాహం తీసుకుని ఉదయం 9గంటలకు తేటగుంట టీడీపీ కార్యాలయంలో కీలక నేతలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరగా వారికి పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఉదయం 9.30గంటలకు పలువురు మైనార్టీ నాయకులతోను, ఉదయం 10గంటలకు నాయీ బ్రాహ్మణ కుటుంబాలతో సమావేశమయ్యారు. తన స్వగ్రామమైన ఏవీ నగరంలో మధ్యాహ్నం 12.30గంటలకు భోజనం చేసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. 2 గంటలకు తుని మండల గ్రామాల్లో కూటమి పార్టీ శ్రేణులతో కలిసి దివ్య ప్రచారం చేపట్టారు. రేఖవాని పాలెం, మరువాడ, నందివంపు గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. -వివరాలు 6వపేజీలో..

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం. 4

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తుని				
2. జగ్గంపేట				
3. ప్రత్తిపాడు				
4. పెద్దాపురం				
5. పిఠాపురం				
6. కాకినాడ సిటీ				
7. కాకినాడ రూరల్				
8. అనపర్తి				
9. రాజానగరం				
10. రాజమండ్రి రూరల్				
11. రాజమండ్రి సిటీ				
12. రంపచోడవరం				
13. రామచంద్రపురం				
14. మండపేట				
15. కొత్తపేట				
16. పి. గన్నవరం				
17. రాజోలు				
18. అమలాపురం				
19. ముమ్మిడివరం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : డోరు నెం. 114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్, పాలచర్ల గ్రామ పంచాయితీ, రాజానగరం మండలం, రాజమండ్రి - 533102.



● రాష్ట్రంలో అరుదైన రాజకీయ నాయకుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి
● ఇప్పటివరకు 9సార్లు పోటీ చేసిన రికార్డు
● ఆరు సార్లు ఎమ్మెల్యేగా..
● ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టేందుకు తహతహ

9 సార్లు పోటీ 6 సార్లు విజయం



బరిలో పదోసారి

ఆంధ్రప్రదేశ్‌లో అరుదైన రాజకీయ నాయకుల్లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఒకరు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండే రాజకీయ నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన పదోసారి శాసన సభ ఎన్నికల బరిలోకి దిగారు. ఇప్పటి వరకూ 9 సార్లు పోటీ చేసి ఆరుసార్లు విజయకేతనం ఎగురవేసిన సీనియర్ నాయకుడు గోరంట్ల ఏడో సారి కూడా తనదే గెలుపంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పదో సారి బరిలోకి దిగుతున్న బుచ్చయ్యచౌదరి తాను ఏడోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి నాలుగుసార్లు, రాజమహేంద్రవరం రూరల్ నుంచి రెండో సారి గెలిచి, మళ్లీ రూరల్ నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా దూసుకుపోతున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ సానుభూతిపరుల కుటుంబం నుంచి వచ్చిన ఆయన రాజమహేంద్రవరంలో కమ్యూనిస్ట్ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినపుడు, ఎన్టీఆర్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం తీసుకున్నారు. గోదావరి జిల్లాలో పార్టీ కన్వీనర్‌గా పార్టీని బలోపేతం చేసిన చరిత్ర ఆయనకు ఉంది. 1983, 1985, 1994, 1999లో రాజమండ్రి నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. అంతకు ముందు 1987 నుంచి ఆంధ్ర ప్రదేశ్ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా 1989 వరకు వ్యవహరించారు. 1989 నుంచి 91 వరకూ రాజమండ్రి, అమలాపురం, కాకినాడ పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1994లో ఎన్టీఆర్ మంత్రివర్గంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రాజమండ్రి సిటీ గెలిచి మంత్రి పదవి చేపట్టిన వారిలో గోరంట్ల రెండో వారు. మొదట ప్రజాపార్టీ నుంచి గెలిచిన డా. ఏబీ నాగేశ్వరరావు పురపాలక, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత గోరంట్ల బుచ్చయ్యచౌదరినే మంత్రిగా చేశారు తప్పిస్తే ఇంకెవరు రాజమహేంద్రవరం సిటీ నుంచి మంత్రి కాలేదు ఇప్పటివరకు. 1995లో ఎన్టీఆర్ తరపున నిలబడి, 1996లో రాజమహేంద్రవరం లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు. 1997లో చంద్రబాబు ఆహ్వానం మేరకు టీడీపీలోనే ఉన్నారు. 2014లో బీజేపీ పొత్తు వల్ల ఆయన రాజమండ్రి రూరల్ నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఆయనే అక్కడ గెలుస్తున్నారు. 2014, 2019లోనూ గెలిచారు. 2024లో కూడా ఆయనే పోటీ చేస్తున్నారు. ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తాననే ధీమాలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఉన్నారు.

వ్యూహ ప్రతివ్యూహాలు



ఉప్పలగుప్తం, మే 10 : అభ్యర్థుల ఎంపిక మొదలు పోలింగ్ రోజు వరకు వ్యూహకర్తలే ఎన్నికల ప్రక్రియను నడిపిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. దశల వారీగా రాజకీయపార్టీల వ్యూహకర్తలు ప్రత్యర్థి శిబిరాల్లో గందరగోళం సృష్టించేలా కుట్రలు చేయడం షరా మామూలే. ప్రచారం, పార్టీ మార్పిడులు, ఎన్నికల మేనిఫెస్టో వంటి అంశాలపై ఎప్పటికప్పుడు వక్రభాష్యాలు, ఫేక్ మెసేజ్‌ల అలజడి, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయడం ద్వారా ఓటర్లలో సందేహాల సృష్టికి శక్తి వంచన లేకుండా శ్రమిస్తుంటారు. అన్ని దశల్లోనూ పుకార్లను షికారు చేయించడం ద్వారా తమ వ్యూహ సాఫల్యతకు వ్యూహకర్తలు నానా తంటాలు పడుతుంటారు. అయితే ప్రచారపర్వం ముగింపు దశకు చేరుకోవడంతో చివరగా ఓటర్లపై పార్టీలు కుబేర అస్త్రాన్ని సంధించే యత్నాల్లో బిజీగా ఉన్నాయి. ఇక్కడ కూడా వ్యూహకర్తలు ప్రత్యర్థుల కుబేరాస్త్రం విఫలమయ్యేలా కుతంత్రాల మంత్రదండంతో ఓటర్లను ఇరుకునపెడుతున్నారు. ఉదాహరణకు ఒక పార్టీ అభ్యర్థి ఒక వీధిలో ఓటుకు వెయ్యి రూపాయలు పంచుతుంటే ప్రత్యర్థి పార్టీ వ్యూహకర్తలు పంపిణీ మొత్తాలపై పుకార్లు పుట్టిస్తున్నారు. ఫలానా గ్రామంలో ఓటుకు రెండు వేలు పంచుతున్న పార్టీ ఇక్కడ వెయ్యితో సరిపెడుతున్నారంటూ పుకార్లను షికారు చేయిస్తున్నారు. దీంతో కొందరు ఓటర్లు పంపిణీదారులను నిలదీస్తున్నారు. మీరు కొంత మినహాయించుకుని మాకు పంచుతున్నారంటూ ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ రకమైన గందరగోళంతో ప్రత్యర్థి పార్టీ ఇరుకున పడుతోంది. వాస్తవాలేమైనప్పటికీ కేవలం పుకార్లకే జనం ఓటేయడంతో పరిస్థితి సందిగ్ధంలో పడింది. గ్రామ, వార్డు స్థాయి నాయకులు ఓటర్లను నమ్మించడానికి నానా తిప్పలు పడుతున్నారు. దాదాపు అన్ని పార్టీల శిబిరాల్లోనూ ఈ పుకార్లు నాయకులకు తలనొప్పిగా పరిణమించాయి. జనరల్ నియోజకవర్గాల్లో అధిక మొత్తంలో జరుగుతున్న కాసుల పంపిణీని రిజర్వుడు నియోజకవర్గాల్లో ప్రచారం చేయడం ద్వారా వ్యూహకర్తలు ఓటర్లలో సందేహాలను రేకెత్తిస్తున్నారు. పార్టీ నిర్ణయం మేరకే పంపిణీ తప్ప మేము కేవలం నిమిత్తమాత్రులమంటూ స్థానిక నాయకులు ఓటర్లకు నచ్చచెప్పేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. చివరి దశలో ప్రత్యర్థి పార్టీల ఓట్లు దండుకోవడానికి వ్యూహకర్తల ప్రయత్నాలు ఫలిస్తాయా? బెడిసికొడతాయా అన్నది ఓటరు దేవుళ్లకే ఎరుక.



మునిగేదెవరు?

అధికార వైసీపీపై గుర్రుగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు

ప్రచారాస్త్రంగా 'అన్యాయం'..తలరాతను నిర్దేశించే తీర్పుకు రెడీ



నిర్వాసితులకు మొండి చెయ్యి

(రంపచోడవరం):

రంపచోడవరం గిరిజన నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని పోలవరం నిర్వాసితులే ఇక్కడి అభ్యర్థుల తలరాతను నిర్దేశించనున్నారు. పోలవరం ప్రాజెక్టు, తద్వారా గోదావరి తీరంలోని ఐదు మండలాలకు ఒనగూరే దుష్ప్రయోజనాలు, పునరావాస అంశాలే ఈ ఎన్నికల్లో ప్రచారాస్త్రాలుగా మారాయి. ముఖ్యంగా గత 59 నెలలుగా వైసీపీ ప్రభుత్వంలో ఎదురైన చేదు అనుభవాలు నిర్వాసిత ఓటర్లను ప్రతికూలంగా మార్చాయి. పోలవరం నిర్వాసితులకు టీడీపీ అన్యాయం చేసిందంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ తర్వాత పునరావాసాన్ని గాలికి వదిలేసింది. వాస్తవానికి గోదావరిలో సగానికిపైగా ఖాళీగా వదిలేసిన కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి, ఎత్తు పెంచేసిన పాపం వైసీపీ ప్రభుత్వానిదే! ఫలితంగా తదనంతర వరదలకు కారణమై మునుపెన్నడూ లేని ముంపును విలీన మండలాలకు వైసీపీ తెచ్చిపెట్టింది.

వైసీపీని నమ్మిన నిర్వాసితులకు జగన్ మొండి చేయి చూపారు. పోలవరం రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసే ఆరు నెలల ముందే నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసాన్ని కల్పించాలన్న నిబంధనను ఉల్లంఘించి నిర్వాసితులను ముంచేసింది. దేవీపట్నం మండలంలో ముంపు గ్రామాలన్నిటినీ పూర్తి స్థాయి పునరావాసం కల్పించకుండానే బలవంతంగా తరలించేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పునరావాసం పూర్తి చేయకుండా నిర్వాసితులను ఖాళీ చేయవద్దంటూ ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేసి నిర్వాసితులను ఖాళీ చేయించింది.

పునరావాస ప్రగతి శూన్యం

విలీన మండలాలకు అన్యాయం

విలీన మండలాల్లో పునరావాస చర్యల్లో ప్రగతి శూన్యమే. వైసీపీ పాలనలో పోలవరం చేపట్టాక వచ్చిన మూడు గోదావరి వరదల్లో ఊహించని ముంపును ఎదుర్కొని గ్రామాలను కట్టుబట్టలతో ఖాళీ చేసి వెళ్లిపోయిన చేదు అనుభవం గోదావరి ప్రభావిత గిరిజన గ్రామాలను వెంటాడుతోంది. ఫలితంగా వైసీపీ ప్రభుత్వం మూలంగా నష్టాన్ని చవిచూసిన చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాలు, దేవీపట్నం మండలంలోని పోలవరం ప్రభావిత ఓటర్లు వ్యవహరించే తీరే ఇక్కడి అభ్యర్థుల తలరాతలను మార్చేసేలా ఉంది. మొత్తం సుమారు 2.77 లక్షల ఓటర్లలో సుమారు ఒక లక్ష మంది పోలవరం ప్రభావిత ఓటర్లే! ఇందులో మెజారిటీ ఓట్లు ఎటు మళ్లుతాయో అటే విజయావకాశాలు ఉండటంతో అధికార వైసీపీ ఆందోళనలో పడింది. తాము నిర్వాసితులకు అండగానే ఉన్నామని, పునరావాసం కల్పించాకనే నిర్వాసితుల తరలింపు ఉంటుందని తమకే మళ్లీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. టీడీపీ అయితే నిర్వాసితులకు అన్యాయం చేసింది జగన్ ప్రభుత్వమేనని, తమ పార్టీ అధికారంలో ఉండగా నిర్వాసితులకు జరిగిన అన్యాయం ఏదీ లేదని, నిర్వాసితుల బలవంతపు తరలింపు తాము చేయలేదని తమకే అవకాశం ఇవ్వాలని కోరుతోంది. అసలు నిర్వాసితులకు అన్యాయం చేసింది ఈ రెండు పార్టీలేనని, ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి తమకు అవకాశం ఇవ్వాలంటూ సీపీఎం ఇంటింటా ప్రచారం సాగిస్తోంది. అయితే వైసీపీ వ్యతిరేక ఓటుతో పాటు నిర్వాసితుల ఓట్లపైనే సీపీఎం ఎక్కువ ఆశపెట్టుకుంది. దీంతో సీపీఎం ఎవరి ఓట్లను చీల్చుతుందో, నిర్వాసితులు ఎవరివైపు నిలిచి, ఎవరిని ముంచుతారో అన్న చర్చ సాగుతోంది.

ఎన్నికల సిబ్బంది మెనూ

ప్రకటించిన ఎన్నికల సంఘం



పెద్దాపురం, మే 10 : ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ విధులకు నియమించిన సిబ్బందికి ఈనెల 12, 13 తేదీల్లో ఇవ్వాల్సిన మెనూను ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. 12వ తేదీ సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో సిబ్బందికి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు రాగానే వారికి బొండాలు, గారెలు అల్పాహారం మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతీ/రోటీ, అన్నం, ఆకుకూర పప్పు, రోటీ పచ్చడి, టమాటా, ఆలుకూర, రసం, పెరుగు వడియాలు, అరటి పండు ఇవ్వాలి. పోలింగ్ రోజైన 13వ తేదీ ఉదయం 4.30 గంటలకు టీ, ఐదు గంటలకు వేడి ఇడ్లీ, గారె, రెండు చట్నీలు ఇవ్వాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు, 11 గంటలకు ప్లమ్ కేక్, టీ.. 12.30 గంటలకు విజిటబుల్ బిర్యానీ, పెరుగు అన్నం, నిమ్మబద్ద మూడు గంటలకు ఉస్మానియా బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్స్ సలాడ్, ఆరు గంటలకు బొండా, గారె చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికంగా తయారు చేయించి ఫ్రెష్‌గా సరిపడేలా తయారుచేసి వడ్డించాలి. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బంది మెనూ ప్రకారం భోజనం అల్పాహారం అందించాలి.

బీప్ శబ్దం వస్తేనే..




ఆత్రేయపురం, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగే పోలింగ్‌లో ఓటు వేసేటప్పుడు ఓటర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలింగ్ కేంద్రంలో ఈవీఎం బటన్ నొక్కినప్పుడు... బీప్ అనే వచ్చే శబ్దం గమనించాలి. అలా శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగం అయినట్టు భావించాల్సి వస్తుంది. అందుకే ఓటు వేసే ప్రతి ఒక్క ఓటరు దృష్టి కేంద్రీకరించాలి. పోలింగ్ కేంద్రంలో ఉండే ముగ్గురు అధికారుల్లో మొదటి అధికారి మన వివరాలు పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో అధికారి ఓటరు నుంచి సంతకం తీసుకుంటారు. మూడో అధికారి చేతి వేలికి ఇంకు మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అది నొక్కినప్పుడు మాత్రమే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. ఈవీఎంలో పార్టీ అభ్యర్థి పేరు, వివరాలు కనిపిస్తాయి. అప్పుడు ఓటరు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చు. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. వృద్ధులు, కొత్త ఓటర్లు ఓటు దుర్వినియోగం కాకుండా కాపాడుకోవాలి.


నేడు పిఠాపురానికి

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్

పిఠాపురం, మే 10: మెగా హీరో రామ్‌చరణ్ శనివారం పిఠాపురం రానున్నారు. తన తల్లి సురేఖతో కలిసి హైదరాబాద్ నుంచి పిఠాపురం రానున్న ఆయన ఉదయం 9.30 గంటలకు పాదగయ క్షేత్రాన్ని సందర్శించుకోనున్నారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతయిన పురుహూతికాఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని సందర్శించి పూజలు చేస్తారు. పూజలు తర్వాత జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలుస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



మేం ఓట్లు అమ్ముకోం..



గొల్లప్రోలు, మే 10: 'ఈ ఇంటిలో ఓట్లకు నోటు తీసుకొనబడవు' అంటూ రాసిన కాగితం గొల్లప్రోలులో ఓ ఇంటి వద్ద దర్శనమిచ్చింది. తాటిపర్తి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గెడ్డమూరి శివ శ్రీనివాసరావు గొల్లప్రోలు పట్టణంలోని దేవీనగర్‌లో నివాసముంటున్నారు. ఓటుకు నోటు ఇస్తూ రాజకీయ పక్షాలు ప్రలోభాలకు గురిచేస్తున్న నేపథ్యంలో ఆయన ముందే మేలుకొన్నారు. ఇంటిలో ఉన్న తనతో పాటు తన భార్య ఓటును అమ్ముకోకూడదని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు తమ ఓటరు నెంబర్లు ఉదహరిస్తూ ఈ ఇంటిలో ఓట్లుకు నోటు తీసుకోమని, దయచేసి ఎవ్వరు ఓటుకు నోటు ఇవ్వడానికి ప్రయత్నించకండి అని చెబుతూ నోటీసులు అంటించారు. ఇది గొల్లప్రోలు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

జనసేన సెగ

కొత్తపల్లి, మే 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ పిఠాపురం ఎమ్మెల్యే వంగా గీతావిశ్వనాథ్‌కు జనసైనికుల సెగ తగిలింది. శుక్రవారం వైసీపీ అభ్యర్థి కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టేందుకు ఉప్పాడ నుంచి కొత్తపల్లి బయలుదేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి గీత వాహనంలో కొత్తపల్లి పాత రెవెన్యూ కార్యాలయం మీదుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఈ లోగా పాత రెవెన్యూ కార్యాలయం వద్ద జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనాలను చూసిన ఆమె ఆగే ప్రయత్నం చేసేలోగా అక్కడ ఉన్న వారంతా జై జనసేన, జై పవన్‌కల్యాణ్ అంటూ నినా అక్కడ ఆగకుండా కాలనీకి వెళ్లారు. తర్వాత కాలనీలోకి వెళ్లి ఓట్లు అభ్యర్థించేందుకు ఇంటింటికీ వెళ్లగా మహిళలు ఎవరూ బయటకు రాకపోవడంతో ఆమె వెనుదిరిగారు. అక్కడ నుంచి వాకతిప్ప చేరుకొని ప్రచారాన్ని కొనసాగించారు.

వైసీపీ నాయకులు నొక్కేస్తున్నారు!

కొత్తపల్లి, మే 10: అధికార వైసీపీ పంపిణీ చేసే నగదులో పలువురు నాయకులు చేతివాటం ప్రదర్శించడంతో గ్రామాల్లో ప్రజలు నాయకుల తీరుపై గుర్రుగా ఉన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులు ఓట్ల కోసం ప్రజలకు ఇచ్చే నగదులో కూడా కోత పెట్టడంతో ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో ఓటర్లకు ఇచ్చే డబ్బులు పంపిణీ చేసే వ్యక్తులు తమ జేబుల్లో నుంచి ఇచ్చినట్టుగా కోత పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్క ఓటుకు రూ.3000 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.1500 ఇస్తున్నారని, అసలు ఇవ్వకపోయినా బాగుండేదని ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామాల్లో ఓటర్లు అనుకొంటున్నారు. డబ్బులు తీసుకొని మనం చేసేది చేద్దామని గ్రామాల్లో ప్రజలు అంతరంగికంగా చర్చించుకోవడం గమనార్హం.

వాళ్లు జనసేనకు ఓటేస్తారు..! డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు..

పిఠాపురం/గొల్లప్రోలు, మే 10: పిఠాపురం నియోజకవర్గంలో అధికార వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. భారీగా ఓట్లు కొనుగోలు చేసేందుకు చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన నేతలు రంగంలోకి దిగారు. వారి కనుసన్నల్లో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలతో పాటు పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లో ఓట్లు కొనుగోలుకు భారీగా నగదును తీసుకువచ్చారు. ఓటుకు రూ.3 వేలు వంతున నగదు పంపిణీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చీరలు పంపిణీ చేశారు. అయితే పంపిణీలో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది. జనసేనకు ఓటు వేస్తారు అని అనుమానం ఉన్న వారికి డబ్బులు ఇవ్వడం లేదు. వారు గాజుగ్లాసుకు ఓటు వేస్తారు వారికి డబ్బులు ఇవ్వక్కర్లేదని బహిరంగంగానే వైసీపీ నేతలు చెబుతున్నారు. దీనిపై గొల్లప్రోలు పట్టణంతో పాటు పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో పలుచోట్ల వివాదాలు జరిగాయి. తమకు ఎందుకు డబ్బులు ఇవ్వరని ప్రజలు నిలదీస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల చోటా మోటా వైసీపీ నేతలు సమాధానం చెప్పలేక జారుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నేడు పిఠాపురానికి జగన్

ప్రజలకు కష్టాలు ప్రారంభం



ఏర్పాట్ల పరిశీలనలో అధికారులు



హెలిపాడ్

జగన్ వచ్చే మార్గంలో షాపులు మూసివేయాలని హుకుం

ఇప్పటికే చెట్ల నరికివేత.. జనసమీకరణకు నేతల పాట్లు


వైసీపీ నాయకుల మధ్య సమన్వయ లోపం

జనసమీకరణ బాధ్యత నుంచి తప్పుకుంటున్న వైనం

పిఠాపురం, మే 10: పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం జరిగే వైసీపీ ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొననున్నారు. సీఎం రానుండటంతో పట్టణ ప్రజలకు కష్టాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కాంక్రీటుతో హెలిపాడ్ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఇప్పటికే దీనిపై క్రీడాభిమానులు నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ హెలిపాడ్ దిగి ఉప్పాడ సెంటర్ వరకూ సీఎం బస్సులో వెళ్లనున్నారు. ఈ మార్గంలో ఉన్న షాపులన్నింటిని శనివారం ఉదయం నుంచే మూసివేయాలని పోలీసులు హుకుం జారీ చేశారు. పట్టణంలోని ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. పట్టణంలోకి వచ్చే వాహనాలు అన్నింటిని బైపాస్‌రోడ్డు మీదుగా మళ్లిస్తామని పోలీసులు తెలిపారు. మరోవైపు సీఎం సభకు జనసమీకరణ కోసం వైసీపీ నేతలు పాట్లు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం వరకూ జనసమీకరణ బాధ్యతలు ఎవరు తీసుకోవాలనే అంశంపై తర్జనభర్జనలు పడ్డారు. బాధ్యత మీదంటే మీదని ఒకరిపై ఒకరు నెపం వేసుకున్నారు. అందరు వచ్చి హడావుడి చేసే వారే తప్ప పనిచేసే వారు లేరని పలువురు పట్టణ, మండలస్థాయి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు కడప, చిత్తూరు జిల్లాలు నుంచి వచ్చిన నేతలు జనసమీకరణపై సమీక్ష చేపట్టారు. తీసుకువచ్చిన ప్రతి ఒక్కరికి రూ. 300 ఇస్తామని ఆటో ఖర్చులు ఇస్తామని సదరు నేతలు, గ్రామ, మండల, పట్టణ, వార్డు స్థాయి నాయకులతో చెప్పారు. ఇప్పుడికి ఇప్పుడు చెబితే ఎలా అని పలువురు ప్రశ్నించారు. కాగా సీఎం జగన్ ప్రచార సభ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు.

డెల్టా కాలువల కట్టివేత

ధవళేశ్వరం, మే10: డెల్టా కాలువలకు నీటి నిల్వలు నిలిపివేసి కాల్వలు కట్టివేశారు. శుక్రవారం సాయంత్రం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేసే హెడ్ స్లూయిజ్ గేట్లను పూర్తిగా దించేసి కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. ఖరీఫ్ చివరి ఆయకట్టు వరకు నీరు పారే విధంగా కాల్వలో పూడికతీత పనులు, లాకులు, తూముల షెట్టర్ల రిపేర్లు, వంటి పనులు నిర్వహించి జూన్ మొదటివారం నాటికి నీటిని విడుదల చేయడానికి కాల్వలు సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.



మద్యం కేసులు స్వాధీనం



పిఠాపురం రూరల్, మే 10: పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. గ్రామంలోని వనుం సత్యనారాయణ ఇంటిలో ఉంచిన 77 కేసుల మద్యం బాటిళ్లను (3,234 మద్యం సీసాలు) స్వాధీనం చేసుకున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడంలో పోలీసులు, అధికారులు తీవ్ర జాప్యం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు, ఇది వైసీపీ నేతలకు చెందిన మద్యం కావడంతో అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎట్టకేలకు పోలీసులు సదరు తాళాలు తొలగించి మద్యం సీసాలను సీజ్ చేశారు. వీటిని వైసీపీ నాయకులు నిల్వ చేసినట్టు చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో వీటిని ఉంచినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

గోదావరి జిల్లాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలు ప్రధానంగా ఏమై ఉంటాయన్న దిశగా చర్చ నడుస్తోంది. సామాజిక బలాలు, మహిళల ఓటింగ్, కీలకమైన యువత ఓటింగ్... ఈ సందర్భంలో చర్చనీయాంశం అయ్యాయి. కాసేపు అభివృద్ధి, సంక్షేమం తదితర వాగ్దానాలను పక్కనబెడితే.. ఏ వర్గాల ఓట్లు ఎవరికి అనుకూలంగా మారతాయన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ విషయంలో వైసీపీతో పోల్చినా.. 'కూటమి' పైచేయిగా ఉందనే చెప్పాలి. టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక.. మెజారిటీ ఓటింగ్ శాతాన్ని సాధించేవిధంగా ఉందని విశ్లేషకులు సైతం చెబుతున్నారు. తెలుగుదేశం, జనసేన కలసి పోటీచేస్తుండడంతోపాటు బీజేపీ సంప్రదాయ ఓటింగ్ అదనంగా కలిసొచ్చే అంశం. అంతేగాకుండా ఈసారి సామాజిక సమీకరణాల్లో పెనుమార్పులు కనిపిస్తుండడం, యువత, ఉద్యోగుల ఓటింగ్ ఎటువైపో ఇప్పటికే కొంత స్పష్టత ఉండడం 'కూటమి' విజయావకాశాలపై అంచనాలను పెంచేసింది. కూటమి పార్టీల మధ్య వైసీపీ ఊహించినట్టుగా సమన్వయలోపం రాకపోగా, అద్భుతమైన ఐక్యత రాగంతో కదనరంగంలో దూసుకెళ్లడం మరో విశేషం.

'బంధం' బలమెంత?

- గోదావరి తీరంలో ఐక్యతా రాగం
- వైసీపీకి వణుకుపుట్టిస్తున్న 'కూటమి'
- ఓట్ల బదిలీకి పట్టుబిగించిన నేతలు
- సామాజిక సమీకరణాల్లోనూ మార్పులు
- 'కీలక' ఓటింగ్ వర్గాలపై ప్రభావితం
- ఒకే మాట.. ఒకే లక్ష్యంతో ముందుకు సాగిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మంచి జోష్ మీద ఉంది. మిత్రబంధం బలంగా.. ముందుకు పయనిస్తోంది. అందరిదీ ఒకటే మాట. ప్రజాకంటక పాలనపోవాలి. వైసీపీని సాగనంపాలి. అదే లక్ష్యం. ఇదే ఆలోచనతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజావ్యతిరేక ఓట్లు చీలకూడదంటూ 'కూటమి'కి రాజమహేంద్రవరంలోనే బీజం వేశారు. అక్రమకేసుల్లో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని ములాఖత్ అయిన తర్వాత తెలుగుదేశం-జనసేన పొత్తు విషయం ప్రకటించారు. ఈ బంధానికి బీజేపీ కూడా త్రివేణీ సంగమంలా కలవడంతో అది మరింత బలపడింది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి'గా కలసి ప్రత్యర్థి వైసీపీపై తలపడుతోంది. సీట్ల పంపకం తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరిలోని కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటు పరిధిలో రాజమండ్రిలో బీజేపీ, కాకినాడలో జనసేన, అమలాపురంలో టీడీపీ పోటీచేస్తున్నాయి. అసెంబ్లీల విషయానికొస్తే మూడు పార్లమెంటు స్థానాల్లో 21 స్థానాలకుగాను జనసేన 6 స్థానాల్లోను, బీజేపీ 1 స్థానంలోను, టీడీపీ 14 స్థానాల్లో టీడీపీ పోటీ చేస్తున్నాయి. వాస్తవానికి ఆయా చోట్ల సీట్ల పంపకంలో కొంత గందరగోళం, ఆందోళనలు నెలకొన్నాయి. దాంతో ఆయా పార్టీల మధ్య ఐక్యత లోపించి కుమ్ములాటలు తప్పవని అధికార వైసీపీ కలలు కంది. కానీ ఒకే లక్ష్యంతో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతలు, శ్రేణులు ఐక్యమయ్యాయి. కిందిస్థాయి కార్యకర్తను అడిగినా, అభ్యర్థిని ప్రశ్నించినా, పొత్తుల వల్ల టిక్కెట్లను త్యాగం చేసిన నేతలను అడిగినా ఒకటే మాట. దుర్మార్గ పాలకుడు జగన్ పోవాలి. వైసీపీ అంతమవ్వాలి. నష్టపోయిన రాష్ట్రాన్ని, నష్టపోయిన ప్రజలను కాపాడడం కోసం కూటమి గెలవాలి. ఇదే అంశాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో కూటమి నేతలు విజయం సాధించారు. అభ్యర్థి, ఆ నియోజకవర్గంలో మిత్రపక్ష నేతల మధ్య సమన్వయం కూడా బాగుండడంతో కేడర్ ఒకేతాటిపైకి రావడానికి పెద్దగా సమయం పట్టలేదు. ఇప్పుడు ఊరూరా కూటమి పక్షాల కేడర్ అంతా కలసి ముందుకు సాగుతున్న దృశ్యాలే అన్ని చోట్లా కనిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు వైసీపీ అభ్యర్థుల్లో, ఆ పార్టీ నేతల్లో వణుకు పుట్టిస్తోంది. గోదావరి జిల్లాలో తీర్పు ఎప్పుడూ 'సునామీ'లా వ్యక్తమవుతుండడంతో ప్రత్యర్థుల గుండెల్లో గుబులురేపుతోంది. 2019 ఎన్నికల నాటికి ఇప్పటికి ఉన్న మార్పులను చాలామంది విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ, జనసేన కలిసిపోవడం, బీజేపీ సంప్రదాయ ఓటింగ్ కూడా ఈసారి కీలకంగానే ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేగాకుండా సామాజిక వర్గాల ఓట్ల బదిలీ పెను సంచలనాలకు దారితీస్తుందేమోనన్న అంచనాలు కూడా దడ పుట్టిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో మెజారిటీ వర్గాల్లో 'ముఖ్యమైన ఓటింగ్ ఒకే తాటిపైకి వస్తుండడం వైసీపీ నేతల్లో కలవరం కలిగిస్తోందని పలువురు చెబుతున్నారు. మహిళలు, యువతరం ఓటింగ్ కూడా ఎటువైపు ఉందనే విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. మహిళలు టీడీపీ పథకాలకు ఆకర్షితులు కావడం, యువతను ఎక్కువగా పవన్‌కల్యాణ్ ప్రభావితం చేయడం కూడా ఓటింగ్ సరళిని మార్చివేసే అవకాశం ఉందని మరో విశ్లేషణ సాగుతోంది. మొత్తానికి కలసికట్టుగా ఎన్నికల బరిలో దిగడం 'కూటమి'కి లాభమేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది. అదే దిశగా ఊరూరా కూటమి శ్రేణులు ఎన్నికల బరిలో దూసుకెళుతున్నాయి.

కలసివచ్చిన కూటమి పొత్తు.. క్షేత్రస్థాయిలో కసిగా పనిచేస్తున్న మూడు పార్టీల శ్రేణులు

రాజమండ్రి పార్లమెంటు పరిధిలో..

రాజమండ్రి లోక్‌సభ కూటమి బీజేపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి 'కూటమి' సహకారంతో ఎన్నికల బరిలో దూసుకుపోతున్నారు. ఎన్టీఆర్ కుమార్తె కావడం వల్ల ఆమెను సొంత ఆడబిడ్డలా అన్ని నియోజకవర్గాల్లో ఆదరిస్తున్నారు. ఆమె విజయానికి కూటమి తరపున టీడీపీ నేతలు గన్ని కృష్ణ, బొడ్డు వెంకటరమణ వంటివారు పనిచేస్తున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని జనసేన కేడర్, టీడీపీ కేడర్ కలసి పనిచేస్తున్నారు. ఇక రాజమండ్రి సిటీ కూటమి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసుకు మద్దతుగా సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. మరో నాయకుడు వై.శ్రీనివాస్ కూడా అదే రీతిలో పనిచేస్తున్నారు. రూరల్ కూటమి టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజయానికి జనసేన కేడర్ అంతా పనిచేస్తోంది. రూరల్ జనసేన ఇన్‌చార్జి కందుల దుర్గేష్ నిడదవోలు నుంచి పోటీచేస్తుండడంతో ఆయన సూచనలతో జనసేన కేడర్ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగింది. బీజేపీ శ్రేణులు కూడా గోరంట్ల గెలుపు కోసం పాటుపడుతున్నాయి. రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు అండగా టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ వర్గం, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర వంటివారు సైతం నిలిచారు. అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయంకోసం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నేత కృష్ణంరాజుతోపాటు కేడర్ అంతా ఒకటే లక్ష్యంగా పనిచేస్తున్నారు. గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు విజయానికి మాజీ జడ్పీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత ముళ్లపూడి బాపిరాజుతోపాటు జనసేన ఇన్‌చార్జి డి.సువర్ణరాజు కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ విజయం కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఆ పార్టీ శ్రేణులు బాగా పనిచేస్తున్నాయి. కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు విజయానికి అక్కడ కింగ్‌మేకర్‌గా ఉన్న అచ్చిబాబు అన్నీ తానై పనిచేస్తున్నారు. జనసేన ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామారావుకు వేరేచోట బాధ్యతలు అప్పగించినా వీలైనప్పుడల్లా ఇక్కడ పనిచేస్తున్నారు. ఇక్కడ జనసేన, బీజేపీ కేడర్ కూడా గెలుపుకోసం కృషి చేస్తున్నాయి.

ఒకటే అజెండా.. అరాచక పాలనకు చరమగీతం పాడాలి...

పిఠాపురం/ కాకినాడ రూరల్/ జగ్గంపేట/ ప్రత్తిపాడు/ మే 10: పొత్తు ధర్మం పాటిస్తూ జనసేన అధినేత గెలుపుకోసం నాతోపాటు తమ టీడీపీ కేడర్ అంతా అకుంఠిత దీక్షతో పనిచేస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ చెప్పారు. ఇక్కడ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీచేస్తున్న విషయం తెలిసిందే. వర్మ మాట్లాడుతూ చంద్రబాబు సూచనలకు అనుగుణంగా జనసేన, బీజేపీలతో అన్ని స్థాయిల్లో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నామని, పవన్‌ను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. ఇక కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) మాట్లాడుతూ జనసేనతోపాటు టీడీపీ, బీజేపీ శ్రేణులు తన విజయానికి అహర్నిశలు పాటుపడుతున్నాయని చెప్పారు. పవన్, చంద్రబాబు పర్యటనలతో కూటమి పార్టీల ఓట్ల బదలాయింపు క్షేత్రస్థాయిలో మరింత బలోపేతమైందని చెప్పారు. కాకినాడ రూరల్ టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ టీడీపీకి కంచుకోట కాకినాడ రూరల్. చంద్రబాబు ఆదేశాల మేరకు పొత్తులో భాగంగా జనసేన పార్టీ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థుల విజయానికి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మితో కలసి పార్టీ కేడర్‌ని సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తున్నామని చెప్పారు. ఓట్ల బదలాయింపునకు అధినేతల పర్యటనలతో మార్గం మరింత సుగమమైందన్నారు. చంద్రబాబు సీఎం కావడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇక జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జనసేన నాయకులు, కార్యకర్తలు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మాటమేరకు తన విజయానికి ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. అధినేత మాటను పాటించే నాయకులు, కార్యకర్తలు జనసేనలో ఉండడం ఆనందదాయకన్నారు. బీజేపీ కేడర్ మద్దతును కూడా కలుపుకుని విజయం సాధిస్తానన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ పార్టీల తారతమ్యాలు లేకుండా కూటమి అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు పనిచేస్తున్నామని చెప్పారు. మా అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాలతో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విజయానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు జగ్గంపేట నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీ అందిస్తామన్నారు. అటు ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి కూటమి టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ కూటమి పార్టీల సహకారం అత్యద్భుతమన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎంతో సమన్వయంతో సహకరిస్తున్నారని చెప్పారు. జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు పార్టీల శ్రేణులు, నాయకులు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో ప్రజల్లో కూటమి పట్ల పూర్తి నమ్మకం ఏర్పడిందన్నారు. కూటమి అభ్యర్థి సత్యప్రభ 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు ఖాయంగా అవకాశాలు కనిపిస్తున్నాయని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ఎంతో పటిష్ఠంగా ఉందన్నారు. ప్రత్యర్థిని మూడు పార్టీల కూటమి చిత్తుగా ఓడించి కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ విజయం సాధిస్తారన్నారు.

అభ్యర్థితో.. ఒకరోజు

రసవత్తరంగా ప్రచారం.. వ్యూహాత్మకంగా పయనం

సంయమనంతో నిర్ణయాలు

- జగ్గంపేట కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూతో 'అభ్యర్థితో ఒకరోజు'

జగ్గంపేట, మే 10: మరో 48గంటల్లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ చివరి రెండు రోజులు కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సంయమనంతో నిర్ణయాలు తీసుకుని వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న జ్యోతుల నెహ్రూతో శుక్రవారం ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒకరోజు' కార్యక్రమం నిర్వహించింది.

నిద్రలేవగానే నాయకులతో భేటీ



ఉదయం ఇంటి నుంచి బయలుదేరుతున్న నెహ్రూ

జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని స్వగృహంలో ఉదయం 5.30 గంటలకే నిద్రలేచి పత్రికలు చదివారు. ఆయన ఉదయం నిద్ర లేచేసరికే ముఖ్య నాయకులు ఇంటివద్ద వేచి ఉన్నారు. ఆయన లేచిన కొద్దిసేపటికే ఒక్కొక్కరుగా వచ్చిన ముఖ్య నాయకులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఆ తర్వాత స్నానాదికాలు ముగించుకుని అల్పాహారం స్వీకరించి పండితుల ఆశీర్వచనాలు పొందారు. పూజ గదికి వెళ్లి పూజ చేసుకుని ఆయన సతీమణి మణమ్మ నుదుట బొట్టు పెట్టి ఎదురు రాగా ఇంటి నుంచి 9.30గంటలకు బయలుదేరి ఇర్రిపాక శివాలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. అక్కడినుంచి జగ్గంపేట పార్టీ కార్యాలయానికి బయలుదేరివెళ్లారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన తనయుడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, నెహ్రూ తమ్ముడు సుబ్బారావుతో ఏకాంతంగా భేటీ అయ్యారు. అనంతరం అక్కడే ఉన్న నాయకులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ సత్కారం.. టీడీపీలో చేరికలు



పార్టీ కార్యాలయంలో నెహ్రూను సత్కరిస్తున్న రిటైర్డు ఎంప్లాయీస్

అనంతరం జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో రిటైర్డు ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు జ్యోతుల నెహ్రూను కలిసి సంఘీభావం తెలిపి సత్కరించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే నెహ్రూకు రిటైర్డు ఎంప్లాయీస్ మొత్తం పూర్తి మద్దతు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం జగ్గంపేట మండలం నరేంద్రపట్నం ఉపసర్పంచ్ కంచి రాంబాబు, ఆయన అనుచరులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. నెహ్రూ వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురం టీడీపీ నాయకులు నంది బాలకృష్ణ, ఉపసర్పంచ్ నంది రాజారావు ఆధ్వర్యంలో 8మంది వలంటీర్లు టీడీపీలో చేరగా వారికి నెహ్రూ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీ కార్యాలయం నుంచి 11గంటల సమయంలో గండేపల్లి మండలం సుబ్బయమ్మపేట ప్రచారానికి వెళ్లారు.

చైతన్యరథంపై ప్రచారం



గండేపల్లి మండలం సుబ్బయ్యమ్మపేటలోఎన్నికల ప్రచారంలో నెహ్రూ

గండేపల్లి మండలం సుబ్బయమ్మపేటలో మధ్యాహ్నం వరకు చైతన్యరథంపై జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా నెహ్రూకు మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. ప్రతిఒక్కరికీ అభివాదం తెలుపుతూ ప్రచారం ముందుకు సాగింది. ప్రచారం ముగిశాక మధ్యాహ్నం 2గంటలకు తిరిగి జగ్గంపేట పార్టీ కార్యాలయానికి చేరుకుని భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నారు. 3.30గంటలకు ఇర్రిపాకలోని స్వగృహానికి వెళ్లారు. అదే సమయంలో సేనాపతుల వర్గమంతా కలిసి వచ్చి నెహ్రూకు మద్దతు పలికారు. అనంతరం ఇర్రిపాక నుంచి గోకవరం మండలంలో ఎన్నికల ప్రచారానికి సాయంత్రం 4గంటలకు వెళ్లారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం శివారు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చైతన్యరథంపై జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి నెహ్రూ ప్రచారంలో పాల్గొన్నారు. అక్కడి ప్రచారం ముగించుకుని గోకవరంనుంచి జగ్గంపేట మండలం సీతారాంపురం, జె.కొత్తూరులో ప్రచారం నిర్వహించారు. రాత్రి 10గంటలకు జగ్గంపేట పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడ ఉన్న నాయకులతో మంతనాలు జరిపి 11గంటలకు ఇర్రిపాకలోని స్వగృహానికి వెళ్లిపోయారు.



పార్టీలో చేరిన వారితో నెహ్రూ

'వనమాడి కొండబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించండి'

కుటుంబ సభ్యుల ఎన్నికల ప్రచారం

కాకినాడ సిటీ, మే 10: కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దుమ్ములపేట, ఏటిమొగ ప్రాంతాల్లో కూటమి అభ్యర్థి కొండబాబు కుమారుడు వనమాడి హేమంత్‌కుమార్ రోడ్ షో ద్వారా ప్రచారం చేపట్టారు. స్థానిక జగన్నాథపురంలోని ఆయన ఇంటివద్ద వనమాడి ఉమాశంకర్ సమక్షంలో పెద్దసంఖ్యలో పార్టీలో చేరారు. స్థానిక 18వ డివిజన్‌లో కొండబాబు సోదరుడి కోడలు వనమాడి రేఖాంజలి పర్యటించి ఎన్నికల ప్రచారం సాగించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కొండబాబును అత్యధిక మెజారి టీతో గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు.



రోడ్ షో ద్వారా వనమాడి హేమంత్‌కుమార్ ప్రచారం



కాకినాడలో టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న వనమాడి ఉమాశంకర్, 18వ డివిజన్‌లో పర్యటిస్తున్న వనమాడి రేఖాంజలి

కొండబాబు విజయం ఖాయం: ఉమాశంకర్

1982లో టీడీపీ ఆవిర్భావం నాటి ప్రభంజనం వీస్తోందని, కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని కాకినాడ సిటీ టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ వనమాడి ఉమాశంకర్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం గడువు ముగుస్తున్న తరుణంలో శుక్రవారం ఆయన వివరాలు తెలియజేశారు. ఉమ్మడి కార్యాచరణతో కాకినాడ నగరంలోని 43 డివిజన్లలో పార్టీశ్రేణులు, కూటమి పక్షాలను కలుపుకొని విజయవంతంగా ప్రచారం పూర్తి చేశారన్నారు. ఎక్కడికక్కడ ప్రజల నుంచి అభ్యర్థి కొండబాబుకు విశేష స్పందన లభించిందన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచి ఇప్పటివరకు కూటమి పక్షాల నాయకులు, శ్రేణులు పూర్తి సహకారం అందించారన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న ఆసక్తి చూస్తుంటే 2019 ఎన్నికల కంటే ఈ సారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరగనుందన్నారు. కూటమి అంటే ఏమిటో చూపేలా స్నేహితులం, కుటుంబసభ్యులందరం విస్తృతంగా ప్రచారం సాగించామన్నారు. ఈ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు రాబోతున్నాయని టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ ఉమాశంకర్ పేర్కొన్నారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్

తాళ్లరేవు, మే 10: మండలంలోని పి.మల్లవరంలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న జార్జిపేట నాగేశ్వరరావుకు చెందిన రెండుట్రాక్టర్లను వీఆర్వో పెయ్యల ప్రకాశరావు పట్టుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. తరలింపుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

జగ్గంపేట కూటమి అభ్యర్థి నెహ్రూ ప్రచారం

గండేపల్లి/జగ్గంపేట, మే 10: జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి నెహ్రూ శుక్రవారం గండేపల్లి మండలం సుబ్బయ్యమ్మపేటలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి ప్రచారం చేశారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, మాజీ సర్పంచ్ బొండా శ్రీనుబాబు, గొల్లవిల్లి అప్పలరాజు, గొల్లవిల్లి రాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బందా శ్రీను, అప్పన శ్రీనివాసరావు, జనసేన నాయకులు సింగులూరి రామదీప్, సింగలూరి వీరబాబు, సామర్ల గంగన్న, అద్దూరి నాగరాజు, లంక రాంబాబు పాల్గొన్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో కిర్లంపూడి మండలం సింహాద్రిపురం టీడీపీ నాయకులు నంది బాలకృష్ణ, గ్రామ ఉపసర్పంచ్ నంది రాజారావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 8 మంది వలంటీర్లు గొడుగుల మెగిలి దుర్గాప్రసాద్, నంది గంగబాబు, గొడుగుల నాగలక్ష్మి, కాలపురెడ్డి గనిలక్ష్మి, తంగిడిపల్లి రాఘవ నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని రిటైర్డ్ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు తోలేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో నెహ్రూకు సంఘీభావం తెలపగా..ఇర్రిపాకలో నెహ్రూ స్వగృహంలో గ్రామానికి చెందిన సేనాపతుల వర్గం వారు మద్దతు తెలిపారు.



చైతన్యరథంపై ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నెహ్రూ

కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముత్తింటి విశ్వేశ్వరరావ్



కాకినాడ క్రైం, మే 10: కాకినాడ బార్ అసోసియేషన్ 2024-25 ఎన్నికలకుగాను నామినేషన్ల పర్వం ముగిసింది. అధ్యక్ష పదవికి ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఇప్పటివరకు అధ్యక్షుడిగా పనిచేసిన ముత్తింటి విశ్వేశ్వరరావ్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శి పదవికి రెండు నామినేషన్లు దాఖలైనా శుక్రవారం జరిగిన స్క్రూటీనీలో ఒక నామినేషన్ తిరస్కరణకు గురి కావడంతో ఇప్పటివరకు కార్యదర్శిగా పనిచేసిన చక్కా శ్రీనివాస్‌కు ఆ పదవ ఏకగ్రీవమైంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు శనివారం వరకు ఉంది. ప్రస్తుత ఎన్నికలకు అధ్యక్షుడిగా ముత్తింటి విశ్వేశ్వరరావ్, జాయింట్ సెక్రటీరిగా పాశం శంకర్ శ్రీనివాస్, కోశాధికారిగా వెంకటరెడ్డి బహదూర్‌షా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరిగా డి.అశోక్‌కుమార్, లైబ్రరీ సెక్రటరిగా కె.దయానందురాజు, సూపర్ సీనియర్ కమిటి మెంబరుగా ఏవీసీహెచ్ఎస్ఎస్ మూర్తి, సీనియర్ కమిటీ మెంబర్‌గా జీవి దుర్గాప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్‌గా నాగ సునీత, లేడి కమిటీ సభ్యుడిగా ఎం.సరోజిని, కమిటీ సభ్యులుగా ఏడుకొండలు, బాబు, ఉమాగౌరీ, బిందుశ్రీ సింగిల్ నామినేషన్లు దాఖలు చేయగా వారిపై పోటీకి నామినేషన్లు దాఖలు కాకపోవడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇప్పటివరకు ఉపాధ్యక్షుడిగా పనిచేసిన కేవీ భద్రరావ్ తిరిగి అదే పదవికి నామినేషన్ దాఖలు చేయగా ఆయనపై పోటీకి సుదిన శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి ఈనెల 17న ఎన్నిక జరగనున్నట్లు ఎన్నికల అధికారి టీపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు.

వైసీపీ ఉండదు..ల్యాండ్ టైటిల్ యాక్ట్ కనబడదు: నాగబాబు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మే 10: ఎన్నికల తర్వాత వైసీపీ ఉండదని, ల్యాండ్ టైటిల్ యాక్ట్ కనబడదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఉపాధ్యక్షుడు కీర్తి రామజోగేశ్వరరావు నేతృత్వంలో బార్ అసోసియేషన్ సభ్యులు నాగబాబును కలిశారు. సమావేశంలో కేపీ శివకుమార్, సీహెచ్.పార్వతీశం, టి.పార్వతినాయుడు, ఎం.సత్యనారాయణ, కేఎస్‌కళావతి తదితరులు పాల్గొనారు.

'మూడు రోజుల్లో రాక్షస పాలన అంతం'

పిఠాపురం రూరల్, మే 10: వైసీపీ రాక్షస పాలన మరో మూడురోజుల్లో అంతం కాబోతోందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం మల్లాంలో నిర్వహించిన సభలో నాగబాబు, సినీ దర్శకుడు మెహర్ రమేష్ మాట్లాడారు.

పోలింగ్ శాతం నమోదుకు ప్రత్యేక సిబ్బంది: కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే 10: సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో భాగంగా కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల పోలింగ్ శాతాన్ని నమోదు చేయడానికి సెక్టార్ వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పోలింగ్ రోజున ప్రతి 2గంటలకు పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ బృందాలు పోలింగ్ ముందు రోజు 12న కంట్రోల్ రూమ్‌లో రిపోర్ట్ చేయాలన్నారు. పోలింగ్ శాతాన్ని పోల్ డే మేనేజ్‌మెంట్ సిస్టం యాప్‌లో కూడా నమోదు చేయాలన్నారు. ఈఆర్‌ఓలు కంట్రోల్ రూమ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని సమాచారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ భావన, డీఆర్వో తిప్పేనాయక్, డీపీవో భారతి సౌజన్య పాల్గొన్నారు.

జగన్ సభకు వాహనాలను లాక్కుంటున్న పోలీసులు

కాకినాడ రూరల్, మే 10: పిఠాపురంలో శనివారం నిర్వహించే సీఎం జగన్ ఎన్నికల ప్రచారసభకు వాహనాలు అవసరమైందని ట్యాక్సీలను బలవంతంగా పోలీసులు, రవాణా శాఖ అధికారులు గుంజుకుంటున్నారు. కాకినాడ జేఎన్టీయూకే ఎదురుగాగల ప్రధాన రహదారిలో జనసేన కార్యాలయ సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు నిలిపివేసి కారులో ఉన్నవారిని అక్కడే దింపి వాహనాన్ని తమకు అప్పగించాలని హుకుం జారీచేశారు. జగన్ పర్యటనకు వాహనాలు అవసరమని దీనికి సంబంధించిన ఆదేశాలున్నాయని పోలీసులు దబాయించారు. ఈ సమాచారం జనసేన నాయకులకు తెలియడంతో అక్కడికి చేరుకున్నారు. ఈ సమస్యపై జనసేన నాయకులు పోలీసులను నిలదీయడంతో కొంతసేపు వాగ్వివాదం అనంతరం పోలీసులు వెనక్కి తగ్గడంతో సమస్య సద్దుమణిగింది. అయితే పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవరించడం తగదని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని ప్రచారం

కాకినాడ సిటీ, మే 10: కాకినాడ పార్లమెంట్ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గ్లాసుగుర్తుపై ఓటు వేసి గెలిపించాలని జనసేన ప్రచార కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తొట్టి రిక్షా తొక్కుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డెయిరీఫారమ్ ఏరియాలో శుక్రవారం ఆయన గ్లాసు గుర్తు కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, తోడి చంగల్‌రావు, బచ్చల కామేశ్వరరావు పాల్గొన్నారు.



డెయిరీఫారమ్ ఏరియాలో తొట్టి రిక్షా తొక్కుతూ ప్రచారం చేస్తున్న రామారావు

కాకినాడ
• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

ఘనంగా చండీహోమం

అన్నవరం, మే 10: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అభ్యర్థితో.. ఒకరోజు

తునిలో పట్టు కోసం
వడివడిగా అడుగులు

» తుని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్యతో 'అభ్యర్థితో ఒకరోజు'

తుని రూరల్, మే 10: తుని అసెంబ్లీ నియోజకవర్గంలో రసవత్తర పోరు సాగుతుంది. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య, వైసీపీ అభ్యర్థి మధ్య ప్రధాన పోటీ ఉంది. పోలింగ్ సమీపిస్తున్న కొద్ది ఫ్యాన్ స్పీడ్ తగ్గుతూ ఉంటే సైకిల్ జోరు అందుకుంటుంది. ఎలాగైనా ఈసారి అధికార పార్టీకి చెక్‌పెట్టాలని యనమల దివ్య వడివడిగా అడుగులు వేస్తున్నారు. కూటమి పార్టీల నాయకులతో వివిధ ప్రజా, కార్మికసంఘాలను, కార్మిక సంఘాలను కలుస్తూ ప్రచారంలో స్పీడ్ పెంచగా ఆంధ్రజ్యోతి శుక్రవారం ఆమెతో అభ్యర్థి ఒక్కరోజు కార్యక్రమం నిర్వహించింది.


పార్టీ శ్రేణులతో ఫోన్‌లో మాట్లాడుతున్న దివ్య


ఉదయం 5గంటలకే నిద్ర లేచి...

కూటమి అభ్యర్థి యనమల దివ్య ఉదయం 5గంటలకే నిద్ర లేచి ఇష్ట దైవానికి పూజలు ఆచరించి 6.30గంటలకు దినపత్రికలు చదివారు. ఉదయం 7గంటలకు నియోజకవర్గంలోని కీలక నాయకులు, మండల, గ్రామస్థాయి నాయకులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలింగ్ సమీపిస్తున్న వేళ కార్యాకర్తలు కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రచారం చేయాలని కోరుతూ క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీస్తూ పలు సూచనలు ఇచ్చారు.


మహిళా నాయకులతో సమావేశంలో దివ్య

నియోజకవర్గ మహిళా నాయకులతో సమావేశం..

తుని నియోజకవర్గ మహిళా నాయకులతో ఉదయం 8గంటలకు దివ్య సమావేశమయ్యారు. నియోజకవర్గంలో మహిళా శక్తికి తాను ఇస్తున్న భరోసా, స్వయం ఉపాధి హామీలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో గ్రామస్థాయి విషయాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఓటింగ్ సరళిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.


టీడీపీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న దివ్య

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు...

8.30గంటలకు బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని ఉదయం 9గంటలకు తేటగుంట టీడీపీ కార్యాలయంలో తునికి చెందిన పలువురు కీలక నేతలు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్‌లు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరగా దివ్య యువనేత యనమల రాజేష్‌తో కలిసి పార్టీ కండువాలు వేసి వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో మైనార్టీ నేత షేక్ హాఫేజ్‌భాషా, తుని 4వవార్డు సచివాలయ కన్వీనర్‌నాగు, గృహసారధులు, పలువురు వైసీపీ కుటుంబాల వారు ఉన్నారు.


తునికి చెందిన మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న యనమల దివ్య

మైనార్టీ నాయకులతో సమావేశమై...

ఉదయం 9.30గంటలకు తుని పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులతో దివ్య సమావేశమయ్యారు. వారు తుని పట్టణంలో పలు వార్డుల్లో సమస్యలు దివ్య దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి హామీ ఇస్తూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని, తునిలో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నాయీ బ్రాహ్మణులతో సమావేశమై...

నియోజకవర్గానికి చెందిన నాయీబ్రాహ్మణ కుటుంబాలతో దివ్య ఉదయం 10గంటలకు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదరణ లేక కులవృత్తులు కుంటుపడ్డాయని, టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండగా ఉంటానని, నిండైన మనస్సుతో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

ఏవీ నగరంలో ప్రచారం...

దివ్య స్వగ్రామమైన ఏవీ నగరంలో మధ్యాహ్నం 12.30గంటలకు బంధుమిత్రులు, కుటుంబీకులతో కలిసి భోజనం ముగించుకుని ఎన్నికల ప్రచారం చేపట్టారు. అన్ని విధాలా గ్రామాభివృద్ధికి మరింత తోడ్పాటుని కల్పిస్తూ విద్య,ఉపాధి అవకాశాలు కల్పిస్తూ అందరికి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తానని హామీ ఇస్తూ ముందుకు సాగారు.


మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబుతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న దివ్య

తుని మండలంలో రోడ్‌షో...

మధ్యాహ్నం 2 గంటలకు తుని మండల గ్రామాల్లో కూటమి పార్టీ శ్రేణులతో కలిసి దివ్య ప్రచారం చేపట్టారు. రేఖవాని పాలెం, మరువాడ, నందివంపు గ్రామాల్లో రోడ్‌షో, ప్రచారం నిర్వహించిన ఆమెకు ఆయా గ్రామస్తులు హారతులు పట్టి మా ఓటు మీకేనంటూ భరోసా ఇచ్చారు. ఆశీర్వదించండి అండగా ఉంటానంటూ రోడ్‌షోలో దివ్య ముందుకు సాగారు.

కూటమిని చూసి భయపడుతున్న జగన్

కూటమి పార్టీల సహకారంతో ప్రచారం అద్వితీయం
పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప


పెద్దాపురం ర్యాలీలో పాల్గొన్న చినరాజప్ప, తుమ్మల బాబు


సామర్లకోట ర్యాలీలో రాజప్ప, పాల్గొన్న కార్యకర్తలు



సామర్లకోట, మే 10: టీడీపీ- బీజేపీ-జనసే కూటమిని చూసి జగన్ భయపడుతున్నాడని... కూటమి పార్టీల సహకారంతో ప్రచారం అద్వితీయమని పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆయన శుక్రవారం సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో పలు ప్రధాన రోడ్ల మీదుగా నిర్వహించిన భారీ బైక్‌ల ర్యాలీతో ప్రచారం మరింత హోరెత్తించింది. ర్యాలీ అగ్రభాగాన చినరాజప్ప, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి విత్తనాల వెంకటరమణలతో బాటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజులు నిలుచుని రోడ్డు కిరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటు ఈనెల 13న ఎన్నికల్లో సైకిల్ గుర్తు పైనా, గాజుగ్లాసు గుర్తు పైనా ఓట్లేసి గెలిపించాలని కూటమి అభ్యర్థులను గెలపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ గత 35 రోజులుగా పెద్దాపురం నియోజకవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు. తాను పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ఖరారైన నాటి నుంచి నామినేషన్ దాఖలు సమయంలోనూ మూడు పార్టీలకు చెందిన అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వెన్నంటి ఉండడమే గాక శుక్రవారం జంట పట్టణాలలో నిర్వహించిన కూటమి బైక్ ర్యాలీతో తనకు గెలుపు అవకాశాలు ముందు రెండు దఫాలు కన్నా మరింత పెరిగేందుకు దోహదపడిందని రాజప్ప దీమా వ్యక్తం చేశారు. ప్రచార రథం వెనుక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో మోటార్‌సైకిళ్లపై భారీ ర్యాలీని సామర్లకోట పురవీధుల మీదుగా నిర్వహించారు. పలు కూడలి ప్రాంతాల్లో రాజప్పను పూలమాలలతో ముంచెత్తి అభినందించారు. ర్యాలీ సామర్లకోట బ్రౌన్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహం జంక్షన్ నుంచి ప్రారంభం కాగా సుమారు కిలోమీటర్ వరకూ రాజప్ప, కూటమి నాయకులు పాదయాత్ర నిర్వహించి తదనంతరం ప్రచార వాహనంపై నిలుచుని ర్యాలీ కొనసాగించారు. ర్యాలీ పాత తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, బళ్ల మార్కెట్, గాంధీబొమ్మ జంక్షన్, స్టేషన్ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్‌ల మీదుగా మఠం సెంటర్ చేరుకుని నందమూరి తారకరామారావు, పొట్టి శ్రీరాములుల విగ్రహాలకు రాజప్ప పూలమాలల వేసి నివాళుల ర్పించారు. అక్కడి నుంచి ర్యాలీ పెద్దాపురం తరలివెళ్లింది. పార్టీ పరిశీలకులు బోళ్ల వెంకటరమణ ర్యాలీని పర్యవేక్షించారు.

భారీ మోటార్ సైకిల్ ర్యాలీ

పెద్దాపురం, మే 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ ఆధ్వర్యంలో రాజప్ప నిర్వహించిన భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ చేపట్టారు. సామర్లకోటలో ప్రారంభమైన ర్యాలీ పెద్దాపురంలో అడుగుపెట్టి మున్సిపల్ సెంటర్ గుర్రాల సెంటర్ వరకూ వెళ్లి అక్క నుంచి సుధా కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంది. ఈ ర్యాలీలో కూటమి అభ్యర్థి నిమ్మకా యల చినరాజప్ప, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ నేత విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు. వేలాదిగా పాల్గొన్న ఈబైక్ ర్యాలీ పొడవునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ చినరాజప్ప ముందుకు సాగారు. పెద్దాపురం నియోజకవర్గం నుంచి సుమారు మూడు వేలమంది టీడీపీ నేతలు, కార్యకర్తలు ఈ మోటార్ బైక్‌లతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ ప్రజల్లో టీడీపీకి వస్తున్న ఆదరణను చూసి వైసీపీ నాయకుల్లో వణుకు ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో అరాచకపాలనను అంతమొందించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు గెలిపించాలని ఆయన కోరారు.

కూటమికే మా మద్దతు

గాండ్ల తెనుకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్


చేబ్రోలులో ఐక్యత చాటుతున్న నాయకులు

గొల్లప్రోలు రూరల్, మే 10: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులకే తమ మద్దతు ఉంటుందని గాండ్ల తెనుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం జరిగిన గాండ్ల తెనుకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీగా పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గాండ్ల తెనుకుల కులస్థులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని, చిన్నతరహా నూనె మిల్లులకు ఉచితంగా కరెంటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జనసేన ఉపాధ్యక్షుడు మహేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, చిత్రాడ సత్యనారాయణ, అయినవిల్లి చల్లారావు, చిన్న, చిత్రాడ రామకృష్ణ, కందా శ్రీనివాస్, గాండ్ల తెనుకుల కులస్థులు తదితరులు ఉన్నారు.

కూటమి గెలుపే అభివృద్ధికి మలుపు

ప్రత్తిపాడు, మే 10: ఎన్నికల్లో కూటమి గెలుపే అభివృద్ధికి మలుపు అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు చెప్పారు. మండలంలోని ఉద్దండ జగన్నాథపురంలో శుక్రవారం కూటమి కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకుడు వట్టికూళ్ల కృష్ణ,బీజేపీ నాయకులు కూరాకుల రాజా, గొల్లపూడి గణేష్, దొంతంశెట్టి చంద్రశేఖర్ ఉన్నారు.

కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం

కార్పొరేషన్ (కాకినాడ), మే 10: కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ విజయం కోసం జనసేన సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, 9వ డివిజన్ అధ్యక్షుడు తల్లిబోయిన సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మత్స్యకారుల హక్కులకు రక్షణ కల్పించాం : యనమల


రోడ్‌షో నిర్వహిస్తున్న యనమల, తంగెళ్ల

తొండంగి, మే 10: టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల హక్కులకు రక్షణ కల్పించామని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్‌లో చోడిపల్లి పేట నుంచి అద్దరిపేట వరకూ రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తీర ప్రాంతంలో ఉన్న వందలాది హేచరీల ద్వారా వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని వీటి రక్షణకు చర్య లు తీసుకుంటామన్నారు. తన కుమార్తె తుని కూటమి అభ్యర్థి యనమల దివ్యను, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి తంగెళ్ల, యనమల రాజేష్, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, సాధనాల నూకరాజు, జనసేన బొండపూడి నాయుడు, బీజేపీ నేత గోపాలకృష్ణ, కాలిబోయిన చంద్రరావు, బంటుపల్లి అన్వేష్ తదితరులున్నారు.

కోరింగలో షాడో పోలింగ్ కేంద్రం పరిశీలన

అమలాపురం టౌన్, మే 10: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు పరిశీలకుడు ఎంవీ చంద్రకాంత్ తాళ్లరేవు మండలం కోరింగలోని షాడో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానికులతో సమావేశమయ్యారు. పోలీసు అధికారులకు సూచనలు చేశారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

కాకినాడ రూరల్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నానాజీ


అచ్యుతాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నానాజీ


అనంతలక్ష్మితో కలిసి ప్రచారంలో పాల్గొన్న నానాజీ

సర్పవరం జంక్షన్, మే 10: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని, ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గొడారిగుంట నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి కార్పొరేషన్ 47, 48వ డివిజన్‌లో ఎన్నికల రోడ్డు షో ప్రచారం నిర్వహించారు. ఎస్.అచ్యుతాపురంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు, కోనాల కృష్ణ ఆధ్వర్యంలో నానాజీకి ఘన స్వాగతం పలికారు. చీడిగ, ఇంద్రపాలెం, కొవ్వాడ, తూరంగి, కరప మండలం పెద్దాపురపాడు, యండమూరు, విజయరాయుడుపాలెం తదితర గ్రామాల్లో రోడ్డు షో, ముఖ్యమైన కూడళ్ల వద్ద ప్రచారం నిర్వహించి జనసేన పార్టీ గాజు గ్లాసు గుర్తుకు ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఉదయ్‌శ్రీనివాస్‌ని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకుందామని, ఒక్క ఛాన్సంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నిలువునా ముంచారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, కూటమి నాయకులు కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ),నులుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, పెంకే శ్రీనివాస బాబా, రాందేవు సీతయ్యదొర పాల్గొన్నారు. 47వ డివజన్‌లో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నానాజీ మాట్లాడారు.

నానాజీకి మద్దతుగా ప్రచారం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు శుక్రవారం రాత్రి ఇంద్రపాలెంలో ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పంతం నానాజీ, తంగెళ్ల శ్రీనివాస్‌కు మద్దతుగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి ఆధ్వర్యంలో భారీ బైక్, వాహన ర్యాలీ నానాజీ కుమారుడు పంతం సందీప్‌తో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్టీవో ఆఫీసు రోడ్డు నుంచి బయలు దేరిన ప్రచారం అర్బన్ పరిధిలోని 7డివిజన్లు, రమణయ్యపేట, ఇంద్రపాలెం, తూరంగి, చీడిగ, తిమ్మాపురం, సూర్యారావుపేటతో పాటూ కరప మండలంలో సాగింది. కార్యక్రమంలో యువ నాయకుడు రుత్విక్ తదితరులున్నారు.


ర్యాలీలో గుణ్ణం చంద్రమౌళి, పంతం సందీప్

'ఫ్యాన్ వల్ల చల్లని గాలి స్వీకరిస్తున్నాం'

కిర్లంపూడి, మే 10: అందరి ఇళ్లలో ఫ్యాన్ ఉండడం వల్ల చల్లటి గాలి స్వీకరిస్తున్నామని ఆ ఫ్యాను గుర్తుకే ఓటేయాలని వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. శుక్రవారం ఆయన పిఠాపురం, రాష్ట్ర ప్రజానీకాన్ని ఉద్దేశించి లేఖ విడుదల చేశారు. సీఎం జగన్ పాలనలో పేదలు ఐదువేళ్లతో తృప్తిగా అన్నం తినే పరిస్థితి ఉందన్నారు. సీఎం జగన్‌కు ఓటేసే విషయంలో తప్పు చేస్తే శాశ్వతంగా నష్టపోతారన్నారు. ఆ తర్వాత వచ్చే పాలకులు రాక్షస పాలన చూపిస్తారని లేఖలో పేర్కొన్నారు.

మహిళల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం

ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ


లంపకలోవలో సత్యప్రభకు గజమాలతో ఘనస్వాగతం


ప్రత్తిపాడులో సత్యప్రభ కుమార్తె సత్యమాధురి ప్రచారం

ప్రత్తిపాడు, మే 10: మహిళలఅభ్యున్నతికి ఎన్డీయే కూటమి ఎంతో ప్రాధాన్యత కల్పించనుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని లంపకలోవ, ఉత్తరకంచిలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. లంపకలోవలో ఆమెకు సర్పంచ్ పి.మణికుమారి, గ్రామ నాయకులు గొంతినసురేష్, చెక్కపల్లి బూరయ్య గజమాలతో ఘన స్వాగతం పలికారు. చైతన్య రథంపై సత్యప్రభ మాట్లాడుతూ తనకు సైకిల్ గుర్తుపై, కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఉత్తరకంచిలో సత్యప్రభ సర్పంచ్ మంతెన వెంకటరమణ, టీడీపీ జిల్లానాయకుడు ఇళ్ల అప్పారావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రత్తిపాడులో సత్యప్రభ కుమార్తె సత్యమాధురి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని రాజవరానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు.


రౌతులపూడి: లచ్చిరెడ్డి పాలెంలో ప్రచారం చేస్తున్న సాయితర్షిత్

ఏలేశ్వరాన్ని అభివృద్ధి చేస్తా

ఏలేశ్వరం, మే 10: కూటమి అధికారంలోకి రాగానే ఏలేశ్వరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని వరుపుల సత్యప్రభ అన్నారు. పట్టణంలో, మండలంలోని సిరిపురంలో సత్యప్రభ జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబుతో ప్రచారం చేపట్టారు కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మూది నారాయణ స్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, యండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, ప్రెండ శ్రీను, రాయుడు చిన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పసల సూరిబాబు, ధనేకుల వీరభద్రరావు, వొనుం మంగ, ధనేకుల అదృష్ట దీపుడు, బచ్చల శివ, వీరబాబు, గోవిందు, వైబోగుల సుబ్బారావు, టీడీపీ. జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయితర్షిత్ ప్రచారం

రౌతులపూడి: హామీలు అమలుచేయని జగన్‌కు ఓటు వేయవద్దని లచ్చిరెడ్డిపాలెంలో ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి సత్యప్రభ కుమారుడు వరుపుల సాయితర్షిత్ ప్రచారం చేసారు. ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభను నెగ్గించాలని కోరారు. ఎస్. అగ్రహారం, కొడూరు, పి.చామవరం గ్రామాల్లో కూటమి తరపున చిత్రారెడ్డి, కరణం సుబ్రహ్మణ్యం, నిర్వానాగు, దాడిశెట్టి సత్యనారాయణ, చిట్రా హరిదాస్, గుర్రం రాంబాబు, అల్లం ప్రసాద్, యనుముల దొరబాబు ఎన్నికల ప్రచారం చేపట్టారు.

'అభివృద్ధి చేసి చూపిస్తాం'


తాళ్లరేవులో మాట్లాడుతున్న కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు హరీష్‌మాధుర్, బుచ్చిబాబు

తాళ్లరేవు, మే 10: కోనసీమ అభివృద్ధి ప్రదాత, తన తండ్రి బాలయోగి చేసిన అభివృద్ధి బాటలోనే పయనిస్తానని, అభివృద్ధి చేసి చూపిస్తామని టీడీపీ కూటమి అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ బాలయోగి అన్నారు. శుక్రవారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమ్మేళనం టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే సంయుక్త నిధులతో నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, సర్పంచ్‌లు టిల్లపూడి నాగేశ్వరరావు, కోరుకొండ సింహాద్రమ్మ, పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీపీ రాయుడు సునీత, వాడ్రేవు వీరబాబు, పెమ్మాడి కృష్ణవేణి, పొన్నమండ రామలక్ష్మి, మోహురి శ్రీనివాస్ ఉన్నారు.

ఆటోలో తరలిస్తున్న మద్యం స్వాధీనం

తాళ్లరేవు, మే 10: గోవా రాష్ట్రం నుంచి అక్రమంగా ఆటోలో 40మద్యం కేసులను తరలిస్తుండగా స్టేట్ టాస్క్‌ఫోర్స్ మంగళగిరి కార్యాలయం అసిస్టెంట్ సూపరిండెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో తాళ్లరేవు సెబ్ అధికారులు శుక్రవారం పత్తిగొంది వంతెనపై దాడిచేసి పట్టుకున్నట్టు సెబ్ ఎస్ఐ చిట్టిబాబు తెలిపారు. గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామానికి చెందిన మల్లాడి మురళికృష్ణ, మల్లాడి నూకరాజులను అరెస్ట్ చేసి ఆటోను సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు.

'ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు'

కార్పొరేషన్ (కాకినాడ), మే 10: ఈనెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై నగరపాలక సంస్థ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమీక్షించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులతో ఆర్వో సమావేశమయ్యారు. ఈనెల 13న పోలింగ్ తర్వాత ఈవీఎంల తరలింపు, ఇతర అంశాలకు సంబంధించి జేఎన్‌టీయూకే ఆవరణలో రిసెప్షన్ సెంటర్‌వద్ద కల్పించాల్సిన విద్యుత్, సౌండ్‌సిస్టమ్, ఇతర సదుపాయాలపై ఆదేశాలిచ్చారు. ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ ఉన్నారు.

'కూటమిని గెలిపిస్తే కాకినాడలో తిరిగి ప్రశాంత వాతావరణం'

కాకినాడ సిటీ, మే 10: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరపున పోటీచేస్తున్న అభ్యర్థులను గెలిపిస్తే కాకినాడలో తిరిగి ప్రశాంత వాతావరణం ఏర్పడనుందని ఆ పార్టీల నేతలు అన్నారు. శుక్రవారం కాకినాడలోని ఓ హోటల్‌లో ఆ పార్టీల నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి అరాచక పాలనకు చరమగీతం పాడాలని, అందుకు ఈనెల 13న ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కాకినాడలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని, ఎటువంటి అన్యాయాలు, అక్రమాలు భూకబ్జాలు జరగవని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నల్లం శ్రీనివాస్, గట్టి సత్యనారాయణ, గుత్తుల రమణ, మాకిరెడ్డి భాస్కర్ హామీ ఇచ్చారు. కాపు, బీసీ, ఎస్సీలను అవమానపరచిన ఎమ్మెల్యే ద్వారంపూడిని ఎన్నికల్లో ఓడించాలని ఆ సామాజికవర్గాలక నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ సామాజికవర్గాలకు చెందిన నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, ప్రెసింగి ఆదినారాయణ, పలివెల రవిఅనంతకుమార్ మాట్లాడారు. కూటమి కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబును సైకిల్ గుర్తుపై, పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గ్లాసు గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రతుల దహనం

సర్పవరం జంక్షన్, మే 10: భూ హక్కు (ల్యాండ్ టైటిలింగ్) పేరుతో సీఎం జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి చట్టంతో సొంత భూములపై హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, దీని ని కూటమి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ రూరల్ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) పేర్కొన్నారు. శుక్రవారం 47వ డివిజన్ కరణం గారి సెంటర్‌లో పార్టీ శ్రేణులతో కలసి చట్టం ప్రతులను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లాబత్తుల అప్పారావు, దేవు వెంకన్న, కాకరపల్లి చలపతిరావు, జంక్షన్ బాబ్జీ, వెంకటలక్ష్మి, యజ్జల బాబ్జీ, బి.రాము తదితరులు ఉన్నారు.